క్లుప్తంగా

వీడ్కోలు సమావేశం



మిడ్జిల్‌: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ గౌస్‌ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పట్టుదలగా చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంపత్‌కుమార్‌, పర్వతాలు, గీత, శిరీష, హజిత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

‘కోమటిరెడ్డి వాఖ్యలు ఖండిస్తున్నాం’

జడ్చర్ల టౌన్‌: చెరుకు సుధాకర్‌గౌడ్‌, ఆయన కుమారుడు డా.సుహాస్‌లను చంపేందుకు నా మనుషులు వంద కార్లలో తిరుగుతున్నారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫోన్‌లో చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఫోన్‌లో సుహాస్‌ను బెదిరించటాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విషయంలో ఎంపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో బీసీసేన నాయకులు లింగంపేట శేఖర్‌, సురభి విజయ్‌ కుమార్‌, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మిడ్జిల్‌: రైతుల సమస్యలను పరిష్కరించాలని, రుణమాఫీ అమలు చేయాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలని, రైతులకు 24గంటల కరెంట్‌ సరఫరా చేయాలని, ప్రధానమంత్రి ఫసల్‌ బీమా అమలు చేయాలని భారతీయ కిసాన్‌ సంఘ్‌, బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ గీత, ట్రాన్స్‌కో ఏఈ జ్ఞానసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌ సంఘ్‌ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జ్‌ ఎంపీపీ తిరుపతమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌, తిరుపతి, శ్రీనువాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిర్వహించాలి

హన్వాడ: మండలంలో మంగళవారం హోలీ పండుగను ప్రజలు శాంతియుతంగా నిర్వహించాలని ఎస్‌ఐ రవినాయక్‌ ఒక ప్రకటనలో సూచించారు. శాంతియుత వాతావరణంలో, ఎవరికీ ఇబ్బందులు లేకుండా చేసుకోవాలని అన్నారు. డీజేలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

భూత్పూర్‌: హోలీ పండుగ సందర్భంగా పట్టణం, మండల ప్రజలు శాంతియుత వాతావరణలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ భాస్కర్‌ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీజేలకు అనుమతి లేదని, ర్యాలీలో పార్టీలకు సంబంధించిన స్లోగన్స్‌ ఇవ్వరాదని, బలవంతంగా రంగులు ఇతరులపై చల్లరాదని తెలిపారు. రోడ్లపై వెళ్లే వాహనదారులకు ఆటంకం కల్గించరాదని తెలిపారు.

చిన్నచింతకుంట: హోలీ పండగను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులకు, యువకులకు హోలీ పండుగపై సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలని కోరారు.

మహాసభలను విజయవంతం చేయాలి

భూత్పూర్‌: గద్వాల జిల్లా కేంద్రంలో ఈనెల 9న జరిగే దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జర్నలిస్టు ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు నరేందర్‌ కోరారు. సోమవారం భూత్పూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ బస్వరాజ్‌ గౌడ్‌ దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న దళిత జర్నలిస్టులు విధిగా రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ రామకృష్ణ, నర్సింహులు, అజీజ్‌, వేము తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కామదహనం

బాలానగర్‌: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం కామదహన కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉడిత్యాల, మోతీఘనపూర్‌, పెద్దరేవల్లి, మొదంపల్లి, గుండేడ్‌లతో పాటు పలు గ్రామాల్లో కామదహన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఇంటి నుంచి నవధాన్యాలను సేకరించిన నిర్వాహకులు ఆవుపేడతో రూపొందించిన పిడకల మధ్య కాముడిని దహనం చేసి తమ బాధలు తీరాలని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ధాన్యాలను ఇళ్లపై చల్లుకున్నారు.

నిత్యం..నరకమే

- కంకరతేలి గుంతలుగా మహబూబ్‌నగర్‌–పరిగి డబుల్‌రోడ్డు
- ఏళ్లు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బురదమయంగా మారిన రోడ్డుపై నాట్లువేసి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్‌ నాయకులు (ఫైల్‌)



నంచర్ల వద్ద వాహనాల రాకపోకలతో చేలరేగుతున్న దుమ్ము

మహమ్మదాబాద్‌: మండలంలోని మహబూబ్‌నగర్‌–పరిగి రోడ్డు నంచర్ల గేట్‌ నుంచి రాఘవాపూర్‌ వరకు 30 కిలోమీటర్లు డబుల్‌రోడ్డు వేసేందుకు ఏడేళ్ల కిందట టెండర్లు వేసి నిర్మాణం ప్రారంభించారు. అదే సమయంలో తమ పొలాల్లో రోడ్డు వేస్తున్నారని కొంత మంది పట్టాదారులకు సంబంధిత అధికారులపై కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు పనులను నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చింది. సదరు పట్టాదారుల ఒప్పందం ప్రకారం తిరిగి పెండింగ్‌లో ఉన్న రోడ్డును పూర్తి చేయాలని రెండేళ్ల కిందట ఆదేశాలు జారీ చేశారు. కానీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకుని పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నంచర్లగేట్‌ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం వద్ద, నంచర్ల కోట వద్ద దాదాపు రెండు కిలోమీటర్ల మేర వదిలేయడంతో రోడ్డంతా కంకరతేలి పెద్దపాటి గుంతలమయంగా మారి ప్రయాణికులకు అవస్థగా మారింది. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పాలకుల నిర్లక్ష్యం..

నంచర్ల గేట్‌ నుంచి పరిగి వెళ్లే ప్రధాన రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏళ్ల తరబడి ఎన్నో అవస్థలు పడుతున్నా పాలకులకు ఏమీ పట్టనట్టుగా ఉందని వాపోతున్నారు. పలుమార్లు రోడ్డుపై ధర్నాలు చేసి నడిరోడ్డుపై బురదలో నాట్లువేసి నిరసనలు తెలిపినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

పట్టాదారులు ఒప్పుకున్నా నిర్లక్ష్యం..



రోడ్డు వెడల్పులో తమ భూములు నష్టపోతున్నామని, పరిహారం ఇవ్వాలని పట్టాదారులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం పట్టాదారులు రోడ్డు వేసేందుకు ఒప్పుకున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– కేఎం నారాయణ, మహమ్మదాబాద్‌

నిత్యం ఇబ్బందులు..



నంచర్ల గేట్‌ నుంచి కుల్కచెర్లకు నిత్యం ఎంతో మంది ప్రయాణికులను చేరవేసేందుకు ఆటోలు నడుపుతున్నాం. గుంతలమయంగా మారిన రోడ్డుతో నిత్యం ఆటోలు రిపేర్లు అవుతున్నాయి. అంతేకాకుండా వర్షాకాలంలో వాహనాలు బురదలో దిగబడుతూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– అంజనేయులు, ఆటో యూనియన్‌ అధ్యక్షుడు, మహమ్మదాబాద్‌

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

నంచర్ల గేట్‌ నుంచి పరిగి రోడ్డు వెడల్పు పనులు చేపట్టే సమయంలో కొందరు పట్టాదారులు కోర్టుకు వెళ్లగా, నిలిచిపోయాయి. కోర్టు కేసు పూర్తి అయినందునా పనులు చేపట్టేందుకు ఎస్టిమేషన్‌ పంపించాం. త్వరలో టెండర్లు పూర్తి చేసి ఎన్నికల కోడ్‌ కాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మహేష్‌, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, పరిగి

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

జడ్చర్ల: ఉమ్మడి పాలమూరు జిల్లా హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కోడ్గల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ మైదానంలో జరిగిన సబ్‌ జూనియర్స్‌ హ్యాండ్‌బాల్‌ పోటీల్లో పలువురు బాలబాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అడ్‌హక్‌ కమిటీ కన్వీనర్‌ శంకర్‌నాయక్‌ తెలిపారు. బాలుర విభాగంలో 16మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, ఈ నెల 10 నుంచి 12వరకు నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం షరీఫ్‌, అశోక్‌ తదితరులు అభినందించారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయండి



వినతిపత్రం అందజేస్తున్న యువజన సంఘం నాయకులు

భూత్పూర్‌: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహం వద్ద అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని కమిషనర్‌ నూరుల్‌ నజీబ్‌కు నవ చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు గడ్డం విజయ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు నర్సింహులుతో పాటు కమిటీ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్‌ 14న అంబేద్కర్‌ జయంతి సందర్భంగా అంబేద్కర్‌ విగ్రహం గతంలో రోడ్డు పక్కన ఉండటంతో తొలగించి పశువుల ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేశారు. విగ్రహానికి పూలమాలలు వేసేందుకు మెట్లు ఏర్పాటు చేయలేదని, విగ్రహం చుట్టూ స్టీల్‌ పైపులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నవ చైతన్య యువజన సంఘం ప్రచార కార్యదర్శి సందీప్‌ కుమార్‌, తేజ, రవి, రమేష్‌, కుమార్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

హోలీలో సహజ రంగులే వాడాలి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న కమిషనర్‌ ప్రదీప్‌కుమార్‌ తదితరులు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: హోలీ వేడుకల్లో సహజ సిద్ధమైన రంగులనే వాడాలని మున్సిపల్‌ కమిషనర్‌ డి.ప్రదీప్‌కుమార్‌ పట్టణ ప్రజలకు సూచించారు. సోమవారం కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ హోలీ పేరిట సిబ్బందితో కలిసి కరపత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేయొద్దన్నారు. సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ను నిషేధించామని, అందరూ వస్త్ర సంచులే ఉపయోగించాలన్నారు. హోలీ సంబురాల్లో అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం బైపాస్‌ రోడ్డు వెంట ఏర్పాటు చేసిన మొక్కలను, బృందావన్‌కాలనీలోని నర్సరీని మున్సిపల్‌ కమిషనర్‌ పరిశీలించారు. మొక్కలను బాగా పెంచి సంరక్షించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కార్యాలయ మేనేజర్‌ వెంకటేశ్వర‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కల పరిశీలన



మోతీఘనపూర్‌లో మొక్కల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బాలానగర్‌: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను రాష్ట్ర ఏజీ అధికారులు కృష్ణమూర్తి, సీఎస్‌ ముకుంద్‌తో కూడిన బృందం సోమవారం పరిశీలించారు. మండలంలోని మోతీఘనపూర్‌, హేమాజీపూర్‌, నమ్యాతండా, పలుగుమీది తండా, పెద్దరేవల్లి తదితర గ్రామాల్లో మండల అధికారులతో కలిసి పర్యటించారు. ఎన్ని మొక్కలు నాటారని, అందులో ఎన్ని మొక్కలు సంరక్షించబడ్డాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పెంపకం కోసం తీసుకుంటున్న చర్యలు, బ్యాగ్‌ ఫిల్లింగ్‌, నర్సరీలు, పల్లె ప్రకృతివనాల నిర్వహణ, రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ నజీర్‌అహ్మద్‌, ఏపీఓ రాజశేఖర్‌ రెడ్డి, సర్పంచ్‌ మాలతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



మహమ్మదాబాద్‌: మేత మేసేందుకు వెళ్లిన పాడిగేదె విద్యుతాఘాతంతో మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జూలపల్లికి చెందిన బెస్త అంజిలయ్య పాడి గేదెలను ఆదివారం పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం గేదె తాడును తెంపుకుని పొలంలోకి మేత మేయడానికి వెళ్లింది. అక్కడే బోరుమోటారుకు ఏర్పాటు చేసిన స్టార్టర్‌ వైర్లు తెగి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ. 70వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విన్నవించాడు.

కార్మికులకు వేతనాలు చెల్లించండి



కోయిల్‌కొండలో నిరసన తెలుపుతున్న కార్మికులు

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, పెండింగ్‌లో వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం డీపీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్కర్లకు వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు జీవనం సాగిస్తున్నారని, అవి కూడా సరిగా ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు.

కోయిల్‌కొండ: పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్‌ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ జయరాములుకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌లు, సెక్రటరీలు వేధింపులు ఆపాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, వెంకటయ్య, చంద్రశేఖర్‌, రాందాస్‌, లక్ష్మయ్య పాల్గొన్నారు.



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దేవదానం, రవి, కొండన్న, లాజర్‌, మోషు, కుర్మన్న సలీం, బురాన్‌ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ జాతర కమిటీ ఎన్నిక

హన్వాడ: మండలంలో పూలే, అంబేడ్కర్‌–3 జాతర కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జంగిహన్మంతు, ఆశంగారి కేశవులును ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు బి.నర్సింహులు నియామక పత్రాలను అందజేశారు. వీరితో పాటు స్థానిక దండోరా నాయకులు జంబులయ్య, కేశవులును జిల్లా కమిటీలోకి తీసుకున్నారు. వచ్చే ఏప్రిల్‌లో నిర్వహించనున్న పూలే అంబేడ్కర్‌ జాతరను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజుమాదిగ, గంగయ్య, కొండయ్య, యాదయ్య, గంగాదర్‌ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ అప్పగింత

రాజాపూర్‌: మండల కేంద్రంలో సోమవారం రాయపల్లికి చెందిన వీరాంజనేయులు సంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చి సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. విషయాన్ని అక్కడే ఉన్న పోలీసులకు చెప్పాడు. ఫోన్‌ లొకేషన్‌ ఆధారంగా రాజాపూర్‌ శివారులో ఓ తండాలో ఉన్నట్లు గుర్తించి అక్కడివెళ్లి సెల్‌ఫోన్‌ను తీసుకువచ్చి బాధితుడికి అందజేశారు. సెల్‌ఫోన్‌ బాధితుడికి అప్పగించడంపై పోలీసులు వెంకట్రాములు, శంకర్‌లను ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అభినందించారు.

సత్యేశ్వర ఆశ్రమంలో కంటివెలుగు శిబిరం



మానసిక దివ్యాంగుడికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్‌ సుచరిత

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని సత్యేశ్వర ఆశ్రమంలో సోమవారం అర్బన్‌ హెల్త్‌సెంటర్‌ ఆధ్వర్యంలో కంటివెలుగు శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆశ్రమంలో ఉన్న మానసిక దివ్యాంగులకు డాక్టర్‌ సుచరిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 86మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో శిబిరం కోఆర్డినేటర్‌ పార్వతమ్మ, విశ్వనాథ్‌, సిబ్బంది ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



అప్పంపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రాథమిక పాఠశాలలో డీఈఓగా అక్షిత, ఎంఈఓగా నందిత, హెచ్‌ఎంగా ఆదర్శ్‌, ఉపాధ్యాయులుగా దివ్యశ్రీ, ప్రసన్న, శ్రీకాంత్‌, కృష్ణ, బాల్‌రెడ్డి, రజియాతో పాటు పలువురు వ్యవహరించారు. ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌ హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు.



ప్రాథమిక పాఠశాలలో..

ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన శివాలయం, వీరప్పయ్యస్వామి ఆలయాల పునర్నిర్మాణం కోసం పలువురు భక్తులు సోమవారం విరాళాలు అందజేశారు. ఎండోమెంట్‌ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలను పునర్నిర్మాణంతో పాటు గాలి గోపురాల నిర్మాణం పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయి. వడ్ల పద్మమ్మ, వడ్ల కృష్ణయ్యలు రూ.11,516లు, కల్వ రమేశ్‌ బాంబే బజార్‌ రూ.11,116, కొండాపురం సురేష్‌ రూ.11,516, సేనాపతి వెంకటమ్మ, జగన్నాథం జ్ఞాపకార్థం రూ.11,116, శాలి పద్మమ్మ రూ.11,116, చాకలి శ్రీనివాసులు బ్రదర్స్‌ రూ.11,116, పంతులు ఎల్లోజీ జ్ఞాపకార్థం రూ.11,116, కురవ వీరేష్‌ రూ.11,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్‌ శివానంద్‌, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌ రెడ్డి, సుదర్శన్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ బిల్లులు విడుదల చేయండి



మాట్లాడుతున్న కె.మోహన్‌

మహబూబ్‌నగర్‌ న్యూటౌన్‌: ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి పెండింగ్‌ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి 40శాతం నిధులు తగ్గించడం సరికాదన్నారు. ఉపాధి పనులకు దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించి రోజుకు రూ.600లు చెల్లించాలన్నారు. వెంటనే పనులు ప్రారంభించకుంటే పీడీ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్మికుల పక్షాన ఈనెల 5న ఢిల్లీలో నిర్వహిస్తున్న మజ్దూర్‌ కిసాన్‌ సంఘర్షణ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌, నాయకులు హనుమంతు, రాములు, భగత్‌, కురుమూర్తి, సాయిలు, మైబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

జడ్చర్ల టౌన్‌: ఈనెల 8నుంచి మూడు రోజుల పాటు సర్పంచ్‌లకు పారిశుద్ధ్యంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటిరోజు మండల పరిషత్‌ సమావేశ మందిరంలో, రెండో రోజు ఏదైనా ఒక గ్రామ పంచాయతీకి వెళ్లి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడవ రోజు ముగింపు సమావేశం ఉంటుందన్నారు. సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



యాత్ర నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ తదితరులు

బాలానగర్‌: మండలంలోని మేడిగడ్డ తండా, మోతీఘనపూర్‌లో హాత్‌ సే హాత్‌ జోడో యాత్ర కార్యక్రమాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మాటలతో సీఎం కేసీఆర్‌ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే ప్రజలు విసిగి వేసారని, వచ్చే ఎన్నికల్లో నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల ప్రధాన కార్యదర్శి హరిసింగ్‌, నరేందర్‌ రెడ్డి, దత్తాత్రేయ, మల్లేష్‌ యాదవ్‌, పెంట్యానాయక్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.